"ఇదిగో......" అంటూ చెయ్యి చాపాడు బుచ్చిబాబు.

"ఏంటది?" అడుగుతూ అతని ప్రక్కన కూర్చుంది సీత.

"కిళ్ళీ.... నేనే చుట్టాను" గొప్పగా చెప్పాడు బుచ్చిబాబు.

"నీకు?"

"ఇదిగో!" రెండు చేతిలోకి మరో కిళ్ళీని చూపించాడు.

సీత బుచ్చిబాబు చేతిలోని కిళ్ళీని అందుకోబోయింది. అతను తన చేతిని వెనక్కి తీస్కున్నాడు.

"ఆ....అను"

సీత నోరు తెరిచింది. బుచ్చిబాబు కిళ్ళీని ఆమె నోటికి అందించాడు. తన చేతిలోని రెండో కిళ్ళీని నోట్లో పెట్టుకోబోతే సీత దాన్ని లాక్కుని తనే బుచ్చిబాబు నోట్లో పెట్టింది.

"నువ్వు వచ్చేలోగా నేను కిళ్ళీ చుట్టి రెడీగా వుంచి నువ్వు రాగానే నీ నోటికి అందించడానికి కారణం ఏంటో చెప్పగలవా?" కిళ్ళీ నములుతూ అన్నాడు బుచ్చిబాబు.

"అదేం పిచ్చి ప్రశ్న నీకు నా మీద ప్రేమ! అందుకే అలా చేశావ్" జవాబు చెప్పింది సీత.

"అసలయిన కారణం అది కాదు"

"మరి?"

"నువ్వు నా ప్రేయసి కావడం, భార్యవి కాకపోవడం! అదే నువ్వు భార్యవి అయి వుంటే ఒ పేన్...... ఆ ఆకూ వక్కా ఇలా అందుకో అని సిల్లీగా నీకు పురమాయించి వుంగడేవాడినిగానీ నీకు కిళ్ళీ చుట్టి పెడతానా?"

సీత రెండు చేతులలో తల పట్టుకుంది.

"బాబూ...నువ్వింక ఆ సోది ఆపుతావా?" బుచ్చిబాబు నవ్వాడు.

"నేను చెప్పేది సెంట్ పర్సెంట్ కరెక్ట్ అని నీకూ తెల్సు, కానీ సిల్లీగా నాదంతా సోదని కొట్టి పారేస్తున్నావ్....అవునా?".

"సరే బాబూ....నన్ను వదిలెయ్! కాదంటే నువ్వూరుకుంటావా? నేను ఒప్పుకునేదాకా సిల్లీగా నన్ను చంపెయ్యవూ!".

"సిల్లీగా!"

బుచ్చిబాబు పకపకా నవ్వాడు. సీత అతని నవ్వుతో శృతి కలిపింది.

"నీకిక్కడ ఎలావుంది?" కాసేపాగి అడిగాడు బుచ్చిబాబు.

"ప్రస్తుతానికి బాగానే వుంది".

"ప్రస్తుతానికి కాదు.....ఎప్పటికీ బాగానే వుంటుంది. ఎందుకంటే మనం భార్యాభర్తలం కాము.....స్నేహితులం, ప్రేయసీ ప్రియులం"

"భార్యాభర్తలు స్నేహితులాగా, ప్రేయసీ ప్రియుల్లాగా వుండకూడదా?"

"ఉండొచ్చు ........ కానీ ఉండలేదు సిల్లీగా, పెళ్ళనగానే మగాడికి నేను మొగుడ్ని అన్న అహంకారం ఆటోమేటిగ్గా వచ్చేస్తుంది!"

“నువ్వు అలా అహంకారంగా వుండొద్దు. అయినా నువ్వు మంచోడివి...నీకు అలాంటి అహంకారం రాదు”

“సిల్లీగా మాట్లాడకు. నేనూ మగాడినే నాకూ అహంకారం వస్తుంది. అయినా నువ్వు టాపిక్‌ని మొత్తం ఎక్కడికో తిప్పి మళ్లీ నేను బాధపడేలా చేస్తావ్. ప్రస్తుతానికిఈ టాపిక్‌ని ఇక్కడితో ఆపేద్దాం” ఖాయంగా అన్నాడు బుచ్చిబాబు.

సీత గాఢంగా నిట్టూర్చింది.

“నేను ఆఫీసుకెళ్లిన తరువాత నీకు బోర్ కొట్టలేదు కదా?” టాపిక్ మారుస్తూ అడిగాడు బుచ్చిబాబు.

“ఉద్యోగం చేసే ఆడదాన్ని ఇంట్లో వుంటే బోర్ కొట్టకుండా ఎలా వుంటుంది? కనీసం మనకి టీవీ,రేడియో ఏమీ లేవు కదా?” అంది సీత.

“సారీ డియర్....ఒక రెండు రోజుల్లో నీకు అన్నీ అరేంజ్ చేస్తాగా? డబుల్ కాట్ మంచం రేపే వేచ్చేస్తుంది” సీత వంక చిలిపిగా చూస్తూ అన్నాడు బుచ్చిబాబు.

సీత బుచ్చిబాబు బుగ్గమీద ఒక పోటు పొడిచింది.

ఇద్దరూ కాసేపు అ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పుకున్నాక సీత పవళించడం మొదలుపెట్టింది.

“ఏం........ నిద్రొస్తుందా?” అడిగాడు బుచ్చిబాబు .

అవునన్నట్లు సీత తల ఊపింది.

“పద.....పడుకుందాం” బుచ్చిబాబు లేచి బెడ్‌రూమ్ వైపు అడుగులు వేశాడు.

సీత అతన్ని అనుసరించింది. బుచ్చిబాబు మంచమీద నడుం వాల్చి సీత వంక చూశాడు. సీత బుచ్చిబాబు ప్రక్కన పడుకోలేదు. గది మూల వున్న చాప చుట్ట తీస్కుని బయటకి నడవసాగింది.

“ఏయ్...ఎక్కడికెళుతున్నావ్ సిల్లీగా?” గట్టిగా అరిచాడు బుచ్చిబాబు మంచంమీద లేచి కూర్చుంటూ.

“నేను హాల్లో పడుకుంటా” చెప్పింది సీత.

“హాల్లోనా? ఎందుకు?”

“ఎందుకేంటి? ఇక్కడ నీ ప్రక్కన ఎలా పడుకుంటాను?”

“నిన్నయితే మనం అర్థరాత్రి ఊర్నుండి వచ్చి అలసిపోయి ఏదో విడివిడిగా పడుకున్నాంగానీ ఈవేళ కూడా సిల్లీగా విడివిడిగా పడుకుంటామా?”

“ఏమో బాబూ నాకు తెలీదు. నేను బయటే పడుకుంటా”

రెండడుగులు ముందుకేసింది సీత.

బుచ్చిబాబు మంచంమీద నుండి క్రిందకి ఒక్క గెంతు గెంతి సీత చేతిలోని చాప లాక్కుని దూరంగా విసిరేసి సీతని రెండు చేతులతో పైకెత్తి మంచం మీద పడేసాడు.

సీత కేవ్వుమని అరిచింది. బుచ్చిబాబు మంచం మీదకి ఎగిరి సీత ప్రక్కన పడుకున్నాడు.

"నేను ట్రాన్స్‌ఫర్ చేయించుకుని నువ్వేమో ఉద్యోగాన్ని వదిలి పెట్టి ఇంత దూరం వచ్చింది మనం విడివిడిగా పడుకోవడానికా?" సీత నడుం చుట్టూ చెయ్యివేసి దగ్గరకు తీసుకుంటూ అన్నాడు బుచ్చిబాబు.

"పెళ్ళి కాకుండా ఇలా నీ ప్రక్కన ఎలా పడుకుంటాను?" బుచ్చిబాబు గుండెల మీద చెయ్యివేసి వెనక్కి తోస్తూ అంది సీత.

"హబ్బ నీలాంటి సిల్లీ ఆడదాన్ని నా జీవితంలో ఎక్కడ చూళ్లేదు!" తలకాయ పట్టుకుని బాధగా అన్నాడు.

"సరే...నేను పడుకుంటానుగానీ నువ్వు పిచ్చివేషాలు ఏమీ వెయ్యకూడదు."

బుచ్చిబాబు భారంగా నిట్టూర్చి మంచం ప్రక్కనే స్విచ్‌నొక్కి లైట్ ఆర్పేసాడు.

అయిదు నిమిషాలు మౌనంగా గడిపారు ఇద్దరూ.

"సీత ....నిద్రపోతున్నావా?" మెల్లగా అడిగాడు బుచ్చిబాబు.

"ఊ" అంది సీత.

బుచ్చిబాబు హఠాత్తుగా సీతని దగ్గరకు లాక్కుని పెదాలమీద ముద్దు పెట్టుకున్నాడు. అప్పుడు బుచ్చిబాబు ఊహించని సంఘటన జరిగింది. సీత అతని ఛాతిమీద రెండు చేతులూ పెట్టి బలంగా తోసిన తోపుకి బుచ్చిబాబు మంచంమీద నుండి నేలమీద ధబేల్‌మని పడ్డాడు.

## 15

"సార్! మిమ్మల్ని మేనేజర్ గారు పిలుస్తున్నారు!" ప్యూన్ వచ్చి చెప్పాడు.

బుచ్చిబాబు సీట్లోంచి లేచి మేనేజర్ మంగారావ్ క్యాబిన్‌లోకి వెళ్ళాడు. మంగారావ్ క్యాబిన్‌లో అతని స్టెనో లిల్లీకూడా వుంది.

"పిలిచారా సార్!" అడిగాడు బుచ్చిబాబు .

మంగారావ్ లిల్లీకి ఇస్తున్న డిక్టేషన్ ఆపి "నేనా?అబ్బే....... లేదే? ఆ ప్యూన్ నీతో జోక్ చేసి వుంటాడు.... అంతే!" అన్నాడు బుచ్చిబాబు.

"అలాగా సర్! హయ్యో! అయినా ఆఫీసులో వాడికివేం సిల్లీ బుద్ధులు? వస్తానండీ." బుచ్చిబాబు వెనక్కి తిరిగాడు.

"హత్తెరి! ఎక్కడికయ్యా పోతున్నావ్?" గట్టిగా అరిచాడు మంగారావ్.

బుచ్చిబాబు వెనక్కితిరిగి అతనివైపు అయోమయంగా చూశాడు.

"లేకపోతే ఆ అడగటం ఏంటయ్యా పిలిచారా సార్ అని? ఇది ఏమైనా ఆఫీసా లేకపోతే నీ యిల్లా వట్టినే జోక్ చేయడానికి....పిలిచారా అని ."ఎందుకు పిలిచారు సార్ అని అడగాలి"

లిల్లీ కిసుక్కున నవ్వింది.

బుచ్చిబాబు ఓసారి లిల్లీ వంక చిరాకుగా చూసి “సారీ సర్. ఎందుకు సార్ పిలిచారు?” అని అడిగాడు.

“ఎందుకా?ఈ ఫైలేంటి, ఈ డ్రాఫ్టింగేంటి? హత్తెరి! దీన్ని చూసి నా దగ్గరికి ఒక్క కస్టమర్ కూడా రాని రోజు ఎంత బాధపడ్తానో అంత బాధపడ్డాను” సీరియస్‌గా చూస్తూ అన్నాడు మంగారావ్.

లిల్లీ మళ్ళీ కిసుక్కున నవ్వింది. బుచ్చిబాబుకి మండింది గాని కంట్రోల్ చేసుకున్నాడు.

“ఏమైంది సార్?” మెల్లగా అడిగాడు.

“ఎవరికి? నాకా? ఫైలుకా? నాకైతేనీ ఫైలు చూడగానే వెర్రెక్కింది! హత్తెరి! అదేం డ్రాఫ్టింగోయ్ బుచ్చిబాబు! ఖాళీ జేబుల్తో వచ్చిన కస్టమర్లంత దరిద్రంగా వుంది”

“మరీ అంత సిల్లీగా వుందా సార్?” బుర్ర గోక్కుంటూ అన్నాడు బుచ్చిబాబు.

“సిల్లీగా కాదు. పరమ దరిద్రంగా వుంది. మళ్ళీ రీ రైట్ చేసి కాస్త ఫేవరబుల్‌గా రాసి పంపించు” అంటూ ఫైలు తీసి విసిరేశాడు మేనేజర్ మంగారావ్.

లిల్లీ కిసకిసా నవ్వింది. బుచ్చిబాబుకి చాలా అవమానంగా అనిపించింది. ఓసారి లిల్లీ వంక సీరియస్‌గా చూసి నేల మీంచి ఫైలు తీసుకుని క్యాబిన్ బయటకి వచ్చి తన సీట్లో కూర్చున్నాడు.

బుచ్చిబాబు మూడ్ అంతా పాడయింది. అసలే రాత్రి జరిగిన సంఘటనకి అతని మనసు బాగలేదు. తను ఏ ఆశయంతో విజయవాడకి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వచ్చాడు?

సీత తనని అసలు ప్రక్కన కూడా పడుకోనివ్వకుండా కనీసం ముద్దు కూడా పెట్టుకోనివ్వకపోతే తన ఆశయాన్ని సాధించేది ఎలా?

రాత్రి సీత తోసిన తోపుకి నడ్డి అదిరిపోయింది. కాస్తలో సంసారానికి పనికిరాకుండా పోయి ఉండేవాడు. అసలే మనసు బాగోపోతే ఈ హత్తెరిగాడు ఒకడు!

అయినా ఆ లిల్లీ చీటికి మాటికి సిల్లీగా అలా ఎందుకు నవ్వుతుంది? దాని పని పట్టాల్సిందే!

బుచ్చిబాబు ఫైల్స్ టేబుల్‌మీద వేసుకుని వాటిల్లో తల దూర్చాడు. పావుగంట సేపు బుచ్చిబాబు పనిలో దీర్ఘంగా మునిగిపోయాడు.

“బుచ్చిబాబు ........... నిన్నే!”

ఎవరో పిలుస్తున్నట్టు అనిపించి తలెత్తి చూశాడు.

కాస్త దూరంలో ఫోన్ రిసీవర్ ఎత్తి పట్టుకుని మోహన్ నిల్చుని వున్నాడు. ఏంటీ అన్నట్టుగా మోహన్ వంక చూసాడు బుచ్చిబాబు.

“కాల్....మీ ఆవిడ దగ్గర్నుండి!” చెప్పాడు మోహన్.

“మా ఆవిడా? మా ఆవిడెవరు??” అయోమయంగా చూస్తూ అడిగాడు బుచ్చిబాబు.

మోహన్ బుచ్చిబాబు వంక అంతకంటే అయోమయంగా చూశాడు.

బుచ్చిబాబుకి అప్పుడు తట్టింది సీత గురించి చెపుతున్నాడని!

"ఓ......మా అవిడ.....సిల్లీ!" నెత్తిన మొట్టికాయ మొట్టుకున్నాడు "సీత ! సీతే కదూ ఫోన్ చేసింది?"

మోహన్ అయోమయంగా తల ఊపాడు. బుచ్చిబాబు సీట్లోంచి లేచెళ్ళి రిసీవర్ అందుకున్నాడు.

"హలో సీత? "

"నేనే!"అవతలి నుండి అంది సీత.

"ఊ!" అన్నాడు బుచ్చిబాబు.

"నామీద కోపం పోయిందా?"

"కోపం దేనికి?"

"నాకు తెలుసులే నామీద నీకు బాగా కోపం వచ్చింది. పొద్దున నాతో సరిగా మాట్లాడలేదుగా"

బుచ్చిబాబు ఏమీ అన్లేదు.

"చూసావా...నువ్వు మౌనంగా వున్నావంటే నామీద ఇంకా కోపం పోనట్టేకదా?" అంది సీత .

"కోపగించుకోవడానికి ఏముందనీ.......ఎవరిభిప్రాయాలు వారివి....నీ అభిప్రాయాలు నీకుంటాయి కదా...."

కాస్త దూరం నుండి ఫోన్‌లో మాట్లాడుతున్న బుచ్చిబాబు మొహంలోని ఫీలింగ్స్‌ని మోహన్ పరిశీలిస్తున్నాడు.

మీ ఆవిడ అంటే ఎవరూ అంటాడేం? అనుకున్నాడు అతనికి మొదట నుండీ కాస్త అనుమానంగానే వుంది.

"దాల్ మే కుచ్ కాలా హై" అనుకున్నాడు మోహన్.

0 0 0

మధ్యాహ్నం...... సమయం ఒంటిగంట? అది లంచ్‌టైమ్. బుచ్చిబాబు ఆఫీసులోంచి బయటికి వచ్చి దగ్గర్లోని ఎస్.టి.డి టెలిఫోన్ బూత్ దగ్గరికి వెళ్ళాడు.

"ఫోన్ చేస్కోవచ్చా?" అక్కడ టేబుల్ ముందు కూర్చుని ఉన్న వ్యక్తిని అడిగాడు బుచ్చిబాబు .

"లేద్సార్......కుదరదు" అన్నాడు వ్యక్తి.

"అదేంటి పబ్లిక్ టెలిఫోన్ బూత్ పెట్టుకుని ఫోన్ చేస్తానంటే కుదరదు అంటావు?" ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు బుచ్చిబాబు .

"లేకపోతే ఏంటిసార్....... ఇక్కడ టెలిఫోన్ బూత్ పెట్టిందే మీలాంటివారికోసం. మళ్ళీ ఫోన్ చేసుకోవచ్చా అని అడుగుతారేం? చేసుకోండి" అన్నాడు.

ఆఖరికి ఈ సిల్లీ వెధవకి కూడా నేనంటే జోకా అనుకుంటూ గ్లాసు క్యాబిన్‌లోకి వెళ్ళాడు.

బుచ్చిబాబు మనసు భగభగ మండిపోతోంది. లంచాలు కొట్టడం కాకుండా స్టాఫ్‌మీద లేనిపోని పెత్తనం చెలాయించే మంగారావు పని పట్టాలని అతను అనుకున్నాడు.

రిసీవర్ ఎత్తి హైదరాబాద్‌లోని ఓ నెంబర్‌ని డయల్ చేయసాగాడు బుచ్చిబాబు .

ఆ నెంబర్ అతని హెడ్డాఫీసులోని సీనియర్ ఎగ్జిక్యూటివ్ నటరాజన్‌ది!

ఫోన్ చేసింది మధ్యాహ్నం సమయం కాబట్టి లైన్స్ వెంటనే దొరికాయి.

అవతల ఫోన్ రింగవుతుంది. నాలుగు సెకన్ల తరువాత ఫోన్ రింగవడం ఆగింది.

“హలో! నటరాజన్ హియర్” అంది అవతలి గొంతు.

“హలో.......నమస్కారం సార్” అన్నాడు బుచ్చిబాబు.

“ఎవరు మాట్లాడ్తురు?” నటరాజన్ అడిగాడు.

“నేను విజయవాడనుంచి మాట్లాడుతున్నా సార్... నా పేరు వీరవెంకట చిన సత్యనారాయణ సార్”

“రొంబ పెద్ద పేరు? నాతో ఏమి పని?”

“నేను ఇక్కడ మీ బ్రాంచ్ మేనజర్ మంగారావు కస్టమర్‌ని సార్”

“కష్టమర్? ఏమప్పా?”

“మీ మేనేజర్ మంగారావు బాగా లంచాలు తింటాడు సార్”

“లంచాలు ఎవరయిన తింటారా? లంచాలుమీద పండుకుని నిద్దర పోదురు కదప్పా?”

నటరాజన్ గొంతులో ఆశ్చర్యం.

బుచ్చిబాబు నెత్తిమీద కొట్టుకున్నాడు.

“అవి లంచాలు కాద్సార్ మంచాలు! మంచాలు! మంచాలమీద పడుకుంటాడు”

“ఓ.......... మంచాలు.....కన్‌ఫ్యూజ్ అయి పూడుస్తిని”

“మీ మేనేజర్ మంగారావు బాగా లంచాలు తింటున్నాడు సార్! అంటే బ్రైబ్ తీసుకుంటున్నాడు. అతనికి లంచాలు యిచ్చేవారికి కస్టమర్సు అంటారు సార్. నేనుకూడా అతని కస్టమరే సార్. నాదగ్గర చాలాసార్లు లంచాలు తిన్నాడు సార్. అయినా అతనికి తృప్తిలేదు సార్”.